

'శాతవాహన' వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్

- నేడు బాధ్యతల స్వీకరణ

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

బతుకుపై భరోసానిస్తూ..

- సంస్కరణలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా జైలు
- ఖైదీలకు వివిధ అంశాల్లో శిక్షణ
- జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవంగా బతికేలా చర్యలు

- కరీంనగర్ అర్బన్, ఆంధ్రజ్యోతి

7

సీజనల్ తోటలు.

- పూలు, కూరగాయల సాగుతో లాభాలు
- పండగల సమయంలో పూలకు గిరాకీ

- సైదాపూర్, ఆంధ్రజ్యోతి

6

జమ్మికుంట పత్తి నాణ్యత బాగుంది

- తేమశాతం 30కి పైగా వస్తుంది
- సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌దావే

- జమ్మికుంట, ఆంధ్రజ్యోతి

7

పత్తి కొనుగోళ్లు ప్రారంభించరా?

మీనమేషాలు లెక్కిస్తున్న సీసీఐ

- తక్కువ ధర చెల్లిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు
- నష్టపోతున్న రైతులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అక్టోబరులో వచ్చే సరికే రైతుకు పత్తి పంట చేతికి రావడం ప్రారంభమవుతుంది. అక్టోబరు, నవంబరు మాసాల్లో వర్షాలు, అల్పపీడనాలు వచ్చే అవకాశాలు ఉన్నందున రైతులు ఎప్పటికప్పుడు పత్తిని ఏరిన వెంటనే మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. పత్తి తడిస్తే తేమ పేరిట వ్యాపారుల దోపిడీ ఉంటుందని, అదే కారణంతో కొనుగోలు చేయడానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ముందుకు రాదని తెలిసిన రైతులు మబ్బులు పడని రోజులు చూసి పత్తిని ఏరుతారు. అక్టోబరులోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు మద్దతు ధర వచ్చే అవకాశముంటుంది. సీసీఐ మాత్రం నవంబరులోనే కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే పత్తి పగలడంతో విధిలేని పరిస్థితుల్లో పత్తి ఏరుతున్న రైతులు ప్రైవేట్ వ్యాపారులకే మద్దతు ధర రాకున్నా అమ్ముకుంటున్నారు.

వాతావరణ పరిస్థితులతో పత్తిలో అధికంగా తేమ

అక్టోబరు ఆరంభం నుంచే పత్తి ఏరడం ప్రారంభించిన రైతులు ఇప్పటి వరకు సుమారు ఐదు వేల క్వింటాళ్లపైన ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించినట్లు చెబుతున్నా అంతకు మించే జరిగినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటుందని సీసీఐ కొనుగోళ్లకు వెనుకాడుతున్నది. నవంబరు నుంచే పత్తి కొనుగోలు చేపట్టాలని సీసీఐ అధికారులు నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. సీసీఐ పత్తిలో తేమ 8 నుంచి 12శాతం ఉండాలని అలాంటి పరిస్థితిలోనే మద్దతు ధర లభిస్తుందని చెబుతున్నది. 8 శాతం తేమ ఉంటే క్వింటాల్‌కు 7,521 రూపాయలు, 9 శాతం తేమ ఉంటే ధరలో ఒకశాతం తగ్గిస్తుంది. 12 శాతం వరకు తేమ ఉంటే 4శాతం ధరను తగ్గించి రైతులకు చెల్లిస్తుంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ వస్తున్నా ప్రస్తుతం 25 శాతానికి పైగా తేమ వస్తుందని, ఈ పరిస్థితిలో తాము కొనుగోలు కేంద్రాలు తెరిచి పత్తి కొనలేమని సీసీఐ అధికారులు ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో తేల్చిచెప్పారని సమాచారం.

సెప్టెంబరులోనే మార్కెట్‌కు కొత్త పత్తి

జిల్లాలో పత్తి విక్రయాలకు ప్రధాన మార్కెట్‌గా పేరుగాంచిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సెప్టెంబరు 24 నుంచే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. గత సీజన్‌కు సంబంధించిన పత్తి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా 7600 ధర పలికింది. కొత్త పత్తి కొనుగోలు గరిష్ఠంగా 6611 రూపాయల నుంచి జమ్మికుంట మార్కెట్‌లో ప్రారంభమైంది. శుక్రవారం కొత్త పత్తి ధర గరిష్ఠంగా ఏడు వేల రూపాయలు పలికింది. గడిచిన 23 రోజులుగా ఈ సీజన్ పత్తికి 6,611 నుంచి ఏడు వేల రూపాయలలోపు మాత్రమే ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు మద్దతు ధరపై 521 రూపాయలు నష్టపోతున్నారు. క్వింటాల్‌కు ఏడు రూపాయల ధర పలుకుతున్నా అది కొద్ది మందికే దక్కుతోంది. సగటు ధర 6,750 రూపాయలకు మించడం లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రైవేట్ వ్యాపారులు పత్తికి మద్దతు ధర చెల్లించకుండా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రస్తుత అకాల వర్షాల కారణంగా చేనులో ఉన్న పత్తిని ఏరాలా లేక వదిలెయ్యాలా అని రైతులు సతమతమవుతున్నారు. పత్తి ఏరి మార్కెట్‌కు తీసుకువస్తే ధర వచ్చే పరిస్థితి లేదు. ఏరకుంటే చెట్టు మీది పత్తి వర్షాలకు తడిసి తేమ పెరగడంతోపాటు రంగు మారే ప్రమాదమున్నది. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ విషయంలో చొరవ చూపించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 42,730 ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో ఈ సంవత్సరం 42,730 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని వ్యవసాయ శాఖ గుర్తించింది. ఎకరాకు తొమ్మిది క్వింటాళ్ల చొప్పున 3,84,570 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈసారి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని రైతులు భావిస్తున్నారు. రైతుల అంచనాల మేరకు ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా 4,27,300 క్వింటాళ్లు అంటే 42,730 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశమున్నది. ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసింది మినహాయిస్తే సుమారు 32వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని సీసీఐ అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి సీసీఐ తొమ్మిది కొనుగోలు కేంద్రాలను గుర్తించింది. చొప్పదండిలోని శివశివాని కాటన్ ఇండస్ట్రీస్, గోపాల్‌రావుపేటలోని కావేరి జిన్నింగ్ మిల్, జమ్మికుంటలోని సీతారామ కాటన్ ఇండస్ట్రీ, మురగన్ ఇండస్ట్రీస్, రాజశ్రీ కాటన్ ఇండస్ట్రీస్, కరీంనగర్‌కు చెందిన మల్లారెడ్డి కాటన్ ఇండస్ట్రీస్, శక్తి మురగన్ ఇండస్ట్రీస్, రామినేని అగ్రో ఇండస్ట్రీస్‌ను పత్తి కొనుగోలు కేంద్రాలుగా నిర్ణయించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులకు, వ్యాపారులకు పత్తిని అమ్ముకోవలసి వస్తున్నది.



కేంద్రమంత్రికి సమస్యలు వివరిస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 18: గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో తనను కలిసిన గ్రూప్-1 అభ్యర్థులకు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలి పెట్టన్నారు. నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులను గోస పెడుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో గ్రూప్-1 అభ్యర్థుల న్యాయం చేయాలని ఆందోళన చేస్తే పోలీసుల తో లాఠీచార్జి చేయిస్తారా అని ప్రశ్నించారు. గ్రూప్-1 పరీక్షలు రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో 29ను ఉపసంహరించుకోవాలన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన తప్పిదాలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో న్యాయం జరిగే వరకు నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హులైన వారికి, మెయిన్స్ పరీక్షకు జారీ చేసిన హాల్ టికెట్లకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. అదనంగా నాలుగు వేల మందికి పైగా హాల్ టికెట్లు ఇచ్చారన్నారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేసి జైలులో వేస్తున్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జారీ చేసిన జీవో 29ను వెంటనే రద్దుచేసే దాకా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామిఇచ్చారు. ఈ విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సమాచారం అందించామని, అశోక్‌నగర్ వెళ్లి నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు ప్రకటిస్తామన్నారు.

పెండింగ్ చలాన్లపై స్పెషల్ డ్రైవ్



పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐలు కరీముల్లాఖాన్, రమేష్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ చలాన్ల వసూలుకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాకా బందీ నిర్వహించి వాహనా లను పట్టుకుని జరిమా నాల ను చెల్లించిన తరువాతనే వదిలిపెట్టారు. సీపీ ఆదే శాల తో శుక్రవారం ఉదయం కరీం నగర్ ఒకటో ఠాణా ఎదుట ట్రాఫిక్ సీఐలు కరీ ముల్లా ఖాన్, పర్శ రమేష్ ఆధ్వ ర్యంలో పోలీసులు కరీంనగర్ ఒకటో ఠాణా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 వాహనాలను పట్టుకుని వాటిపై నమోదైన ఉల్లంఘన కేసులకు సంబంధించిన చలాన్లను అప్పటికప్పుడే యజమానులతో ఆన్‌లైన్ ద్వారా చెల్లింపజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ మాట్లాడుతూ వాహనాల సైలెన్సర్లు మార్చవద్దని, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయవద్దని, ఇతర ట్రాఫిక నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రూప్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను సజావుగనిర్వహించేందుకు పటిష్టం చేసేందుకు సన్నద్ధంకావాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల ధ్రువీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో ప్రశ్న పత్రాలు ఇతర ముఖ్యమైన సామగ్రి భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించాలన్నారు. గ్రూప్-3 పరీక్షకు మూడు పేపర్లు, గ్రూప్-2 పరీక్షకు నాలుగు పేపర్లు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో 56 సెంటర్లను గుర్తించామని, జిల్లా నుంచి 27,712 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ సంబంధాలు పెంపొందిస్తాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, తదితరులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 18: విద్యార్థుల మధ్య క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొం దిస్తాయని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలబాలికల అండర్-14 వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని 16 మండలాల నుంచి 320 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కార్యదర్శి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులు సొల్లు సారయ్య, ఎండి యూనిస్ పాషా, పెటా నాయకుడు కె కృష్ణ పాల్గొన్నారు.

అండర్-17 క్రికెట్ ఎంపిక పోటీలకు విశేష స్పందన

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అండర్-17 ఎస్‌జీఎఫ్ బాలుర క్రికెట్ ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎడ్జ్ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 200 మంది క్రికెట్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు సొల్లు సారయ్య క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. కార్యక్రమంలో పెటా టీఎస్ రాష్ట్ర ప్రతినిధి కె కృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, అంతడ్పుల శ్రీనివాస్, బాబు శ్రీనివాస్, వీరన్న, ఆడెపు శ్రీనివాస్, సూర్యప్రకాశ్, ఎస్ రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

'కళాభారతి'ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతాం



కళాభారతి ఆడిటోరియంను సందర్శించి కమిషనర్‌తో చర్చిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 18: కరీంనగర్ కళాభారతి ఆడిటోరియాన్ని ఆధునిక హంగు లతో తీర్చిదిద్దుతామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం ఆమె కళాభారతి ఆడిటోరియాన్నితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాభారతిని రాష్ట్రం లోనే అత్యుత్తమ ఆడిటోరియంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించారు. కళాభారతిలో సీటింగ్, విద్యుత్ గ్రీన్ రూమ్, లైటింగ్ వ్యవస్థతో పాటు టెక్నికల్ అంశాల కల్పనకు ప్రత్యేక నిపుణులతో చర్చించి ఆధునీ కరిస్తామని చెప్పారు. ఇందుకోసం అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా ప్రజలకు ఆధునిక హంగులతో కూడిన కళాభారతి ఆడిటోరి యాన్ని అందుబాటులోకి తీసుకురా వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయండి

ఉపాధి హామీ పథకం కింది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నింటిని డిసెంబరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఈవోలు, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను నిర్మించాలని సూచించారు. ఈపనులను ట్రైనీ కలెక్టర్ అజయ్‌కుమార్ పర్యవేక్షిస్తారని చెప్పారు.

శుక్రవారం సభతో మహిళల సమస్యల పరిష్కారం

భగత్‌నగర్: మహిళల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ వేది కగా నిలుస్తున్నదని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిమహిళ, గర్భిణి, బాలింత శుక్ర వారం సభకు తప్పక హాజరు కావాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక మంలో భాగంగా జిల్లాలోని మహిళలందరికి యాభై రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో సంజీవరావు, జీపీ ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి ఎంసరస్వతి, సీడీపీవో సబిత, డీఎంహెచ్‌వో సుజాత పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. శుక్రవారం నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, నందు, అనిల్, యోగేష్, విఘ్నేష్, హరీష్ పాల్గొన్నారు.

తెరుచుకున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు

గణేశ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని శాతవాహన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక బంద్ నిర్వహించారు. నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో కళాశాలలు శుక్రవారం తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా శాతవాహన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. శుక్రవారం నుంచి కళాశాలలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గంగిపల్లిలో గోదాం ప్రారంభం



గంగిపల్లిలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, అక్టోబరు 18: రైతు సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ సహకార సంఘం పరిధిలోని గంగిపల్లిలో 150 మెట్రిక్ టన్నుల గోదాంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. గోదాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బ్యాంకుల్లో సాఫ్ట్‌వేర్ తప్పిదం వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, అలాంటి వారి డాటాను వ్యవసాయ అధికారులు సేకరించారన్నారు. వారం రోజుల్లో వారందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కాకతీయ మిషన్ భగీరథ పథకాల్లో అక్రమాలకు పాల్పడ్డ బీఆర్ఎస్ నాయకులు మూసీ నదీ ప్రక్షాళనపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అబద్ధాలతో పదేళ్లు ప్రజలను మోసం చేశాడే తప్ప ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద 28 సమీకృత గురుకుల పాఠశాలలను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని, బీఆర్ఎస్ దోచుకునే పార్టీ అని అన్నారు. ఈదుల గట్టెపల్లి నుంచి అన్నారం, చెంజర్ల నుంచి పచ్చునూర్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, గంగిపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కేసు

- శునకం కళేబరానికి పోస్టుమార్టం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో తిరుగుతున్న ఒక కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గురువారం ఒక కుక్కను అజీజ్ అనే వ్యక్తి ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. కుక్క కళేబరాన్ని అక్కడే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాడు. ఈ ఘటనను స్థానికంగా ఉన్న ఒక జంతు సంరక్షణ కార్యకర్త తన ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ఈ విషయాన్ని స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త ఎదులాపురం గౌతమ్‌కు తెలియజేశారు. వెంటనే ఆ కార్యకర్త సంఘటనాస్థలానికి చేరుకుని కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దీనిపై జంతు సంక్షేమ ఉద్యమ నాయకురాలు మేనకాగాంధీ పోలీసులకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కరీంనగర్ వెటర్నరీ హాస్పిటల్‌లో కుక్క కళేబరానికి పోస్టుమార్టం కూడా నిర్వహించారు. ఈ కేసులో నిందితుడికి పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించారు. ఆ కుక్క తనను కరవడంతోనే ఆగ్రహంగా అజీజ్ కొట్టిచంపాడని చెబుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


రమ్యకృష్ణ (ఫైల్)

పెగడపల్లి/రామడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన అలువాల రమ్యకృష్ణ (30) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న రాత్రి రామడుగు మండలం గోపాల్‌రావుపేట నుంచి పెగడపల్లికి అలువాల విష్ణు, రమ్యకృష్ణలు ఇరువురు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. వ్యాక వెంకయ్యపెల్లి గ్రామ శివారులో ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా కిందపడి గాయాలపాయ్యారు. రమ్య కృష్ణను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


లక్ష్మణ్‌గౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భాగన్నగారి లక్ష్మణ్ గౌడ్ (38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంభీరావుపేటకు చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణం అనుబంధమైన పర్మిట్ రూంలో కొంత కాలంగా వంట మనిషిగా పని చేస్తుండేవాడు. ఉదయం వచ్చి రాత్రి పూట వెళ్లేవాడు. గురువారం రాత్రి పర్మిట్ రూం మూసిన తర్వాత గంభీరావుపేటకు వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండుకు చేరుకున్నాడు. ఓ టేలా వెనుక పడిపోయి కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కొదురుపాక గ్రామానికి చెందిన దుగ్యాల జితేందర్‌రావు(22) అనే యువకుడు ఇటీవల ఖాళీగా తిరుగుతుండడంతో తల్లి ఏదైనా పని చేసుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈనెల 15న ఊరు బయట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లక్ష్మికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. పెద్ద కుమారుడు ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుడి రథోత్సవం


లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామివారి బ్రహోత్సవాల్లో బాగంగా శుక్రవారం రథోత్సవం చేపట్టారు. గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీల ఆధ్వ ర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కేదెట్ల..?

- మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు
- నడిచి వెళ్లే భక్తులకు ఇబ్బందులు


మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు

మల్యాల, అక్టోబరు 18: కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి కొండపైకి నడిచి వెళ్లే మెట్లమార్గంలో చెట్టు అడ్డంగా పడిపోయింది. దీంతో ఈ మార్గంలో కొండ ఎక్కే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెట్టు నెల రోజుల క్రితం పడిపోయినట్లు తెలుస్తుండగా దాన్ని తొలగించడం లేదు. దీనికి తోడు మెట్లమార్గానికి ఇరువైపుల పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి భక్తులు నడవడానికి అవరోధంగా మారింది. అయినా దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు



శిక్షణ పొందుతున్న యువకులతో పీడీ

యువకులకు శిక్షణ ఇస్తున్న గంగసాగర్

నిరుద్యోగ యువతకు అండగా

ఆదర్శం

- ఆర్మీలో చేరాలనుకునే వారికి ఉచిత శిక్షణ
- అభ్యర్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు
- ఇప్పటి వరకు 45 మందికి ఉద్యోగం

ఆర్మీ ఉద్యోగం సాధించాలనేది ఆయన కల. అందుకు తగ్గట్టుగానే కొన్నేళ్లు కష్టపడ్డాడు. ఎలాగైనా కొలువు సాధించాలని సాధన చేశాడు. కానీ ఆయన కల మాత్రం నెరవేరలేదు. చెవి దగ్గర ఉన్న చిన్న లోపంతో ఆయన ఆర్మీ ఉద్యోగానికి దూరం అయ్యాడు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఎంతో ఇష్టమైన ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకున్నా ఆసక్తి ఉన్న వారు సాధించేలా సహాయ పడాలనుకున్నాడు. కానిస్టేబుల్, ఆర్మీ ఉద్యోగాలు అంటే ఇష్టమున్న యువతకు ఉచిత శిక్షణ ఇస్తూ వారు ఉద్యోగం సాధించేలా కృషి చేస్తున్నాడు.

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన కల్వకోట గంగసాగర్ అనే యువకుడు ఆర్మీ ఉద్యోగం సాధించాలని అనుకున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. అయితే ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకపోయినా ఆ ఉద్యోగంలో యువతను చేర్పించాలనే ఆయన ఆశయంగా పెట్టుకున్నాడు. ఇందులో భాగంగా 2016 నుంచి నిరుద్యోగ యువతకు కానిస్టేబుల్, పారామిలటరీ బలగాలతోపాటు ఇటీవలి అగ్నివీర్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన శిక్షణ అందించిన వారిలో 35మంది కానిస్టేబుల్స్ 10 మంది ఆర్మీలో ఉద్యోగం సాధించారు. 2020లో వచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ సందర్భంగా గంగసాగర్ 85 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. వారిలో 20 మంది ఉద్యోగం సాధించారు. 2018లో 55మంది శిక్షణ ఇస్తే అందులో 15మంది ఉద్యోగాలు పొందారు.

● ఉద్యోగం.. శిక్షణ

గంగసాగర్ వ్యాయామ ఉపాధ్యాయుడుగా తన సొంతూరులోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉద్యోగం చేశాడు. అదే పాఠశాల మైదానంలో యువతకు శిక్షణ ప్రారంభించాడు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శారీరక శిక్షణ ఇస్తూ తరువాత పాఠశాలకు వెళ్లడం ఆయన దినచర్య. ప్రస్తుతం తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో



పీడీగా విధులు నిర్వహిస్తున్నాడు. గంగసాగర్ ఆసక్తి ఉన్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా నిత్యం శిక్షణ అందిస్తున్నాడు. గంగాసాగర్ వద్ద శిక్షణకు మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల నుంచి యువకులు వస్తుంటారు. ప్రస్తుతం పారామిలటరీ, అగ్నివీర్‌కు 15మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణతో పాటు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాడు గంగసాగర్.

● మెడికల్ ఫెయిల్‌తో..

గంగసాగర్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశసేవ సేవ చేయాలని కలలు కనేవాడు. అందులో భాగంగానే శిక్షణ పొందాడు. చెవి సంబంధిత చిన్న పాటి లోపంతో ఆర్మీ ఉద్యోగం సాధించలేక పోయాడు. దీంతో తాను సాధించకున్నా అదే ఉద్యోగం కొంత మంది యువతకైనా దక్కేలా చేయాలని అనుకున్నాడు. వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభించాడు.

● ఉచితంగా శిక్షణ ఇస్తా..



ప్రజలకు సేవలందించే పోలీస్, ఆర్మీలో చేరాలనే యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నా. ఆసక్తి ఉన్న యువకులు ఎవరైనా నన్ను సంప్రదించవచ్చు. శారీరక శిక్షణ ఇచ్చి, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తా. నేను ఆర్మీలో చేరాలని అనుకున్న.. సాధ్యం కాలేదు. నాలా ఆసక్తి ఉన్న కొంతమందైనా ఆర్మీలోకి వెళ్లాలనే ఆలోచనతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించా.

- కల్వకోట గంగసాగర్

హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రి తనిఖీ

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు శుక్రవారం తనిఖీ చేశారు. గురువారం రాత్రి ఏరియా ఆస్పత్రిలోని బాత్రూంలో లభించిన నవజాత శిశువు మృతదేహంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, శానిటైజేషన్ సిబ్బందిని విచారించారు. ఆస్పత్రి సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. దర్యాప్తు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకో వాలని ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు మాట్లాడుతూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేయడానికే కొంత మంది ఇలాంటివి చేస్తున్నారని చెప్పారు. ఈ శిశువు మృతదేహం ఆస్పత్రి బటయ నుంచి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందిని విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ చందు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

పురుగుల మందు డబ్బాలతో ఆందోళన

- తన పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపణ
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతు

గొల్లపల్లి, అక్టోబరు 18: తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ ఏర్పాటు యత్నాలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో శుక్రవారం ఆందోళన చేపట్టాడు. బాధితుడు మండలంలోని బీబీరాజ్ పల్లె గ్రామానికి చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ తీయడానికి గ్రామానికి చెందిన కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించాడు. కాలువ పరిసరాల్లో చాలా మంది రైతుల పట్టా భూములు ఉన్నాయని, వారెవ్వరి భూములను సర్వే చేయకుండా తనవే సర్వే చేయడంతో గతంలో పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా మళ్లీ సర్వే చేసేందుకు వచ్చారని పేర్కొన్నాడు.


దీంతో మనస్తాపం చెంది ఆందోళనకు దిగినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరందన్ బాధిత రైతు వద్దకు వచ్చి మాట్లాడారు. పట్టా భూమిలో నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడం లేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొనడంతో బాధితులు ఆందోళనను విరమించారు. ల్యాండ్ ఆక్విజేషన్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని, అంతే తప్ప పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని పేర్కొన్నారు. తాను మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని, దీని పై పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రవీందర్ సాగుచేస్తున్న బంతితోట


పట్టుకుచ్చు తోట

సీజనల్ తోటలు

- పూలు, కూరగాయల సాగుతో లాభాలు
- పండగల సమయంలో పూలకు గిరాకీ


మునగ తోటలో అంతర్ పంటగా బంతి తోట


పూత దశలో ఉన్న బంతి తోట

సైదాపూర్, అక్టోబరు 18: సీజన్‌ను బట్టి పూలు, కూరగాయల తోటల సాగు చేస్తూ కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతీసారీ వరి, పత్తి, మొక్క జొన్న పంటలు పండిస్తుండడంతో భూములలో భూసారం తగ్గి పంట దిగుబడి రాకపోవడం, చీడ పీడలు ఆశించడంతో చాలా మంది రైతులు నష్ట పోతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారిస్తు న్నారు. సైదాపూర్ మండలం రాంచంద్రా పూర్ గ్రామానికి చెందిన రైతు ఎనుగుల రవీందర్ బంతిపూలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. రవీందర్ తన కున్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇంకో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. సీజన్లను బట్టి కూరగాయలు, పూలతోటల పెంపకానికి మొగ్గు చూపాడు. ఎనిమిది ఎక రాల్లో పూలు, కూరగాయలు సాగు చేస్తు న్నాడు. ఎకరానికి రెండు లక్షల వరకు ఆదా యం వస్తుందని రవీందర్ అంటున్నాడు. వ్యవసాయంతోపాటు రవీందర్ పాడి ఆవులు పోషిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

● మునగ తోటలో అంతర పంటలుగా..

ఎనిమిది ఎకరాల్లో మునగ తోట సాగు చేస్తున్నాడు. చెట్ల మధ్యలో ఖాళీగా ఉన్న భూమిలో అంతర పంటగా బంతి, పట్టు కుచ్చు పూల తోటలు సాగు చేశాడు. బతుకమ్మ పండగ మొదలు కొని ఉగాది వరకు పూలకు మంచి గిరాకీ ఉంటుంది. దసరా నుంచి ఉగాది వరకు మంచి రోజులు ఉండడంతో శుభకార్యాలు జరుగుతుంటాయి. ఈ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది.

● గిరాకీకి అనుగుణంగా కూరగాయల సాగు

ఏ కూరగాయలకు ఏ సీజన్‌లో గిరాకి ఉంటుందోనని గుర్తించి, ఆ సీజన్‌లో ఆ కూరగాయలు సాగు చేస్తుంటాడు. పండిన కూరగాయలు, పూలను హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. తోట వద్దకు వచ్చిన వారికి తాజ పూలు, కురగాయలు కోసి అమ్ముతారు..

● మంచి లాభాలు వస్తున్నాయి

నేను ఎనిమిది సంవత్సరాలుగా కాలానికనుగునంగా సీజన్ బట్టి పూలు, కూరగాయల తోటలు సాగు చేస్తున్నాను.ఎకరాకు పెట్టుబడి పోను 1.5 లక్షల రూపాయల వరకు ఆదా యం వస్తుంది. కష్టపడి పని చేస్తే వాణిజ్య పంటలతో లాభాలు పొందవచ్చు.

- ఎనుగుల రవీందర్, రైతు, రాంచంద్రాపూర్


బంతి తోటలో ఎనుగుల రవీందర్

వేర్వేరు చోట్ల చోరీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల చోరీలు జరిగాయి. ధర్మారం మండల కేంద్రానికి చెందిన చింతల రాజు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు చింతల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కేశవపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో తన బంధువుల ఇంటిలో నిర్వహించిన శుభకార్యానికి వెళ్లిన సమయంలో ధర్మారం మండల కేంద్రంలోని తాళం వేసిన తన ఇంటిలో తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం తన డ్రైవర్ రాజు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయని తెలుపగా కుటుంబ సభ్యులతో సహా ధర్మారం వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి, బీరువా తెరిచి ఉందని అందులో 38 గ్రాముల బంగారం, 30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి తులంన్నర బంగారు చైను. అర తులం చొప్పున ఉన్న రెండు బంగారు ఉంగరాలు, రూ.8 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు పెట్టిన కారును తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వీలుగాక కారును ధ్వంసం చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. దొంగతనాలకు సంబంధించి పోలీస్‌లు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిపై కత్తితో దాడి

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన నూనే రవి అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన విబూది కిష్టయ్య కత్తితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నూనే రవి ఇంటి సమీపంలోని కిష్టయ్య వద్ద కొన్ని రోజుల క్రితం మధ్యవర్తిగా ఉండి మరో వ్యక్తికి డబ్బులను ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న రవిని డబ్బులు చెల్లించాలని కిష్టయ్య అడిగాడ . దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కిష్టయ్య ఇంట్లోకి వెళ్లి కత్తి తెచ్చి రవిపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వారించడంతో కిష్టయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించి రవిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మద్యం మత్తులో ఘర్షణకు దిగినట్లు స్థానికులు తెలిపారు. రవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాప్ వేలంపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటలో బెల్ట్‌షాప్ వేలం వేసిన మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాం, బొద్దుల పర్శరాం, గౌర అంజయ్య, సోమ మల్లయ్యపై శుక్రవారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయానికి అమ్మ డానికి పెద్దమనుషులు వేలం నిర్వహించగా జి.శ్రీకాంత్ అనే వ్యక్తిని షాప్ నడిపేందుకు రూ.66,500 డిమాండ్ చేశారని, రూ.33 వేలు తీసుకొని మిగతావి ఇవ్వాలని బెదిరించారని డీఎస్పీ తెలిపారు.

న్యూస్ బాక్స్

అవిష్కరణలపై ఎస్సారార్‌లో వర్క్‌షాప్

గణేశ్‌నగర్,అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో శుక్రవారం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం, పాలసీస్, ఐక్యుఏసీ సంయుక్త నిర్వహణలో కళాశాల అధ్యాపకులకు వర్ క్షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిరంతరం మదింపు చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్ కొరకు ఎస్ఆర్ఆర్ కళాశాలను ఎంచుకున్నందుకు కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్రిస్ప్ కోఆర్డినేటర్ సురభి కాక్ నిర్వహించారు. ఇనిస్టూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సస్టైనబుల్ గోల్స్ విశ్లేషణ, విజన్ మిషన్, లక్ష్యాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముందుగా ఫ్లగ్ పోస్ట్ టెరిటరీ అనే కార్యాచరణను ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ హరజోత్ కౌర్ మాట్లాడుతూ ఐక్యుఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి నితిన్, టి రాజయ్య, సీఓఈ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యుఏసి సభ్యులు డాక్టర్ టి కరుణాకర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సోమనరసయ్య, డాక్టర్ రాజశ్రీ, ప్రేమ్చందర్, అన్ని విభాగాల హెచ్ఓడిలు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కాటన్ వస్త్ర పరిశ్రమకు చేయూతనివ్వాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమతోపాటు వాటిపై ఆధారపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని జిల్లా సైజింగ్ వర్కర్స్ యూ నియన్ అధ్యక్ష, కార్యదర్శులు వొల్లాల కిషోర్, ఎలిగేటి రాము డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయానికి కరీంనగర్ జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో కాటన్ కార్మికులు తరలివచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ రెండో భీవండిగా పేరుగాంచిందన్నారు. గతంలో సిరిసిల్లలో వేలాది మర మగ్గాలు ఉండేవని, వాటికి అనుబంధంగా 30 సైజింగ్ పరిశ్రమలతోపాటు క్లాత్ డైయింగ్, పెట్టి కోట్స్, హమాలీ, ట్రాన్స్ పోర్టల ద్వారా వేలాది మంది జీవనోపాధి పొం దారని అన్నారు. గత ప్రభుత్వం కాటన్ వస్త్ర పరిశ్రమలకు మొండి చేయి చూపిందని, పాలి స్టర్ బతుకమ్మ చీరల ను తయారు చేయిం చడంతో కాటన్ వస్త్ర పరిశ్రమ కుంటు పడిపో యిందని అన్నారు. కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రకటిం చిన చీరలను కాటన్‌తో తయారు చేయించాలని కోరారు.



కరీంనగర్ జిల్లా జైలు

బతుకుపై భరోసానిస్తూ..

ఒకప్పుడు జైళ్లు అంటే కఠిన శిక్షలకు మారు పేరు..

ప్రస్తుతం పరిస్థితులు మా రాయి. ప్రభుత్వాలు పలు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ పనుల్లో శిక్షణను అందిస్తున్నారు. కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందులో శిక్షను అనుభవిస్తున్న వారితోపాటు విడుదలైన వారూ పని చేస్తున్నారు. జైలులో పలువురు ఫర్నీచర్, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. దీని ద్వారా ఖైదీలు ఉపాధి పొంది కొంత మొత్తాన్ని ఇంటికి పంపించుకుంటున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తాము నేర్చుకున్న పనులు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.

- సంస్కరణలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా జైలు
- ఖైదీలకు వివిధ అంశాల్లో శిక్షణ
- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతో ఉపాధి
- జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవంగా బతికేలా చర్యలు


బంకులో పని చేస్తున్న ఖైదీలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నేర సంఘటనల్లో జైలుకు వెళ్లిన ఖైదీలపై సమాజంలో కొంత చెడు అభిప్రాయం ఉండడం సహజం. శిక్షణ అనుభవించి బయటకు వచ్చిన తర్వాత తమ పద్ధతి, వ్యవహారశైలిని మార్చుకుని మంచి వ్యక్తులుగా జీవించాలని భావించినా సమాజంలో వారిని నేరస్థులుగానే పరిగణిస్తున్నారు. దీంతో వారికి ఎక్కడా సరైన ఉపాధి లభించడం లేదు. ఇటువంటి పరివర్తన చెందిన ఖైదీల కోసం జైళ్లశాఖ ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణనిస్తోంది. శిక్ష కాలంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ జైలు నుంచి విడుదల అయిన తరువాత వారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా జీవనోపాధి మార్గాలను చూపుతున్నది. ఖైదీల నడవడికలో మార్పును తీసుకువచ్చి సమాజంలో పౌరులుగా గౌరవంగా బతికేలా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ముందుకు సాగుతున్నది.

● వివిధ పనుల్లో శిక్షణ

కరీంనగర్ జిల్లా జైలులో పలు సంస్కరణలు తీసుకు వచ్చారు. మొదట ఖైదీలకు వరంగల్ సెంట్రల్ జైలు, కరీంనగర్ జైలులో వివిధ పనుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆ తరువాత శిక్షణ పొందిన ఖైదీలతో ఫర్నిచర్, ఫినాయిల్ తయారీని చేపట్టారు. జైలు ఆవరణలో ఐఓసీఎల్ సంస్థ సహకారంతో మై నేషన్ పేరుతో పెట్రోల్‌బంక్‌ను నెలకొల్పారు. ఈ పెట్రోల్‌బంక్‌లో ప్రస్తుతం ఐదుగురు రిమాండ్ ఖైదీలతోపాటు జైలు నుంచి విడుదలైన మరో 20 మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. వీరిలో రిమాండ్ ఖైదీలకు రోజుకు 225, శిక్ష అనుభవించి విడుదలైన వారికి రోజుకు 550 రూపాయల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.

● పెట్రోల్ బంక్ విస్తరణ

కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో 2017 జూన్ 17న ఐఓసిఎల్ పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సంస్థ మొదట మూడు యంత్రాలతో 12 నాజిల్స్ ఏర్పాటు చేసింది. గిరాకీ పెరగడంతో ఆరు యంత్రాలు, 24 నాజిల్స్‌కు విస్తరించింది. జైలుకు చెందిన 1,200 చదరపు గజాల విస్తీర్ణంలో బంక్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుని ఈ స్థలాన్ని 20 ఏళ్లపాటు ఐఓసీఎల్ సంస్థ లీజుకు తీసుకున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు 18 లక్షల నుంచి 20 లక్షల వ్యాపారం జరుగుతున్నది. రోజుకు ఎనిమిది వేల నుంచి 10 వేల లీటర్ల పెట్రోల్, ఆరు వేల నుంచి 8 వేల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. పెట్రోల్ అమ్మకాలపై లీటరుకు రెండు రూపాయలు కమిషన్‌గా ఆదాయం సమకూరుతున్నది. జిల్లా జైలు రెండున్నర ఎకరాల స్థలంలో ఉంది. ఇందులో జైలు బ్యారక్, ఇతర కార్యాలయాలు, జైలు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ఉన్నాయి. జైలు ఆవరణలోని పెట్రోల్‌బంక్ లాభసాటిగా నడుస్తుండడంతో కరీంనగర్ శివారులో మరో పెట్రోల్ బంక్‌ను జైళ్లశాఖ లీజ్‌కు తీసుకుని నడిపిస్తున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నది. ఇక్కడ ఎనిమిది మంది ఖైదీలు పనిచేస్తున్నారు. జైలు లోపల ఏర్పాటు చేసిన ఫర్నిచర్ తయారీ కేంద్రంలో మరో 30 మంది వరకు ఉపాధిని కల్పిస్తున్నారు.

● జైళ్ల శాఖ అవుట్‌లెట్...

కరీంనగర్ జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఒక అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి ఇందులో కరీంనగర్, వరంగల్ సెంట్రల్ జైలు ఖైదీలు తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. వీటికి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ స్టాల్‌లో కూడా ఖైదీ ఉపాధి పొందుతున్నాడు. జైలు ఆవరణలో నర్సరీలో పెంచిన మొక్కలను, ఫినాయిల్‌ను కూడా ప్రత్యేకస్టాల్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. జైల్ ఇండస్ట్రీలో తయారైన కుర్చీలు, టేబుళ్ళు ఇతర ఫర్నిచర్‌ను పాఠశాలలకు విక్రయిస్తున్నారు.

ఆరేళ్లుగా పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాను : ఇర్ఫాన్, ఓపెన్‌జైలు ఖైదీ

నేను జైలులోనే ఉంటూ ఇక్కడి పెట్రోల్‌బంక్‌లో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. సంపాదించిన డబ్బుల్లో కొంత ఇంటికి పంపిస్తున్నాను. ఓపెన్ జైలులో భాగంగా పెట్రోల్‌బంక్‌లో పనిచేయడం వల్ల నిత్యం ప్రజల్లో ఉండడంతో ప్రశాంతంగా ఉంది. సత్ప్రవర్తనతో ఉండడంతో ఆరు నెలలకు ఒకసారి నెల రోజులు పెరోల్‌పై ఇంటికి వెళి కుటుంబసభ్యులతో గడుపుతున్నాను.

ఉపాధి చూపించారు.. : రాజు

2015 నుంచి జైలు పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాను. ఏడు సంవత్సరాల క్రితం జైలు నుంచి విడుదల అయినప్పటి నుంచి పెట్రోల్‌బంక్‌లో పార్ట్ టైంగా పనిచేస్తూ మిగతా సమయంలో ఇంటి వద్ద వ్యవసాయం, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నెలకు 16 వేల రూపాయలు సంపాదిస్తున్నాను. నాకు ఉపాధిని కల్పించిన జైలు అధికారులకు కృతజ్ఞతలు.

● ఖైదీల్లో పరివర్తనపై దృష్టి సారించాం..



క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తతీసుకువచ్చి, సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిగా జైలు నుంచి బయటకు వెళ్ళి సామాన్యజీవిత గడిపేలా చేయడమే ధ్యేయంగా జైలు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నాం. నేరస్థుడిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో గౌరవంగా బతికేలా అతనికి ఉపాధి కల్పించటానికి ప్రయత్నిస్తున్నాం. ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణను అందిస్తూ సొంతకాళ్లపై నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతకు మారుపేరుగా మైనేషన్ బ్రాండ్‌తో పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నాం. 24 గంటలపాటు సీసీ కెమరాల నిఘాలో ఈ పెట్రోల్ బంక్ నడుస్తుంది.

- కె శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్

పత్తి నాణ్యత బేష్

● సీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌దావే


జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న అర్జున్‌దావే

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో పత్తి నాణ్యత బాగుందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డా వే అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో నోటిపై చేసిన ఏడు జిన్నింగ్ మిల్లులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మిల్లుల్లోని యంత్రాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిన్నింగ్ చేసేందుకు యంత్రాలు సిద్ధంగా ఉన్నాయో, లేదో పరిశీలించారు. పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బహిరంగ వేలం పాట ద్వారా ట్రేడర్స్ ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో పర్యవేక్షించారు. రైతులు తీసుకు వచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, ఇతర అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో కలిసి సమావేశం అయ్యారు. జిన్నింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీసీఐ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జమ్మికుంటలో పత్తి నాణ్యత చాల బాగుందన్నారు. కాని తేమశాతం 30పైకి పైగా వస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టి తీసుకు వస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. నోటిపై చేసిన మిల్లులన్ని తనిఖీలు చేశామని, జిన్నింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తేమశాతం 12లోపు వస్తే కొనుగోళ్లు చేపట్టేందుకు ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర 7,521 రూపాయలు దాటి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్లు చేపడితే కమర్షియల్ పర్చస్ సైతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వరంగల్ సీసీఐ పరిధిలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా పట్టణంలోని సరిత కాటన్ జిన్నింగ్ మిల్లుకు ఓ రైతు తమ పత్తిని విక్రయానికి తెచ్చాడు. పత్తిని పరిశీలించే ముందు సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌దావే తమ కాళ్లకు ఉన్న షూస్‌ను తొలగించి పత్తిని ముట్టుకు న్నారు. రైతు పండించిన పత్తిని సీసీఐ అధికారి అంత పవిత్రంగా బావించడంపై అక్కడున్న వారు అభినందిస్తూ చర్చించుకున్నారు.

'శాతవాహన' వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్


ఉమేశ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివ ర్శిటీ ఉపకులపతి (వీసీ)గా ప్రొ ఫెసర్ డాక్టర్ యు. ఉమేశ్‌కుమార్ నియ మితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ పేటకు చెందిన ఉమేశ్‌కుమార్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్‌గా, రిజిస్ట్రార్‌గా, శాతవాహన యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. యుఎస్ఏలోని యూనివర్శిటీ ఆఫ్ వెర్మోంట్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ అసోసియేట్‌గా సేవలందించారు. 28 సంవత్సరాల బోధన, 20 సంవత్సరాల పరిశోధన అనుభవాన్ని కలిగిన ఉమేశ్ కుమార్ వివిధ జాతీయ, అంతర్జాతీ య పత్రికల్లో 36 కథనాలను ప్రచు రించారు. అతడు యూజీసీలో సైతం రెండు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టారు. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పొందగా, ఒకరు పీహెచ్‌డీ కోసం పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్శిటీ ఈసీగా, హర్యానాలోని బివానీ చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయానికి గవర్నర్ నామినీగా నియమితు లయ్యారు. పాలమూరు యూనివర్శిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ఉమేశ్‌కుమార్ పనిచేశారు. అత్యుత్తమ విద్యా సహకారాలకు వివిధ విద్యావేత్తల నుంచి అవార్డులను అందుకున్నారు. అతను ఎంచుకున్న రంగంలో అకడమిక్ ఎక్సలెన్స్‌గా గుర్తింపుతో అవార్డులను స్వీకరించారు. సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, ఐఎస్ఐఆర్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో వివిధ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులను నిర్వహించారు. నవంబర్ 19, 2015న భారత రాష్ట్రపతి నుంచి ప్రతిష్టాత్మక ఇందిరాగాంధీ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీని కూడా అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట అనుభవం కలిగిన ప్రొఫెసర్ యు.ఉమేశ్‌కుమార్‌ను శాతవాహన వీసీగా నియమించడం పట్ల పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆయన శనివారం వీసీగా బాధ్య తలు స్వీకరిస్తారని తెలిసింది.

గ్రానైట్ లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ వ్యాన్

తిమ్మాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న గ్రానైట్ లారీని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రానైట్ లారీ మండలంలోని ఎల్ఎండీ కాలనీ మహిళా శిశు కేంద్రం సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి నిలిచిపోయింది. వరంగల్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఆగివున్న గ్రానైట్ లారీను అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్‌లో ఉన్న సిద్దిపేట జిల్లా గౌరెల్లి మండల్ కొండాపూర్ గ్రామానికి చెందిన భూక్యరాజు, సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కొతిగల్ గ్రామానికి చెందిన ఎల్ వాగ్య వాహనంలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళుతున్న వాహనదారులు ఆగి వాహనం లో ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి ఎల్ఎండీ బ్లూ కోల్ట్స్ పోలీసులు సురేష్, మల్లికార్జున్ చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీఎం గ్రీన్ సిగ్నల్

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి లాంచన ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టర్ నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల పరిధిలోని పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి వస్తున్నాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారాన్ని కూడా దీని పరిధిలోకి చేర్చారు. వెల్గటూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలు విలీనం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రామగుండంతో పాటు మరో రెండు మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సైతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ రుడా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రతిపాదన పెట్టడమే కాకుండా పట్టుబడుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు దీనికి సంబంధించి ప్రక్రియ ముందుకు సాగడంలో చొరవ చూపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,59,332 జనాభా ఉంది. 2024లో ఈ జనాభా 15లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. 7లక్షల జనాభాతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు తెలుస్తుంది. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి సంబంధించి ఎజెండా పెట్టనున్నారు.

● నామకరణమే తరువాయి..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ఖాయమైపోయింది. ఇక నామకరణమే మిగిలింది. సుదీర్ఘ కాలంగా రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేయాలని జిల్లాలో డిమాండ్ ఉంది. రామగుండానికి చారిత్రక, పురాణాల నేపథ్యం ఉంది. రామయణ కాలంలో రాముడు ఇక్కడ నివసించాడనే నానుడింది. ఆ పేరునే రామునిగుండాలు ఉన్నాయి. ఈ గుండాల పేరు మీదునే ఈ నగరానికి రామగుండంగా పేరు వచ్చింది. జనగామలో పురాతన త్రిలింగ రాజరాజేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. దేశంలోనే ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనే సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. కాగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విస్తరిస్తుండడంతో మరేదైనా పేరును ఖరారు చేస్తారా అనే చర్చ కూడా సాగుతోంది. కరీంనగర్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటివి ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, యంత్రాంగం సూచించే పేరునే ఖరారు చేసే అవకాశం ఉంది.

23 నుంచి వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలి

తిమ్మాపూర్, అక్టోబరు18 (ఆంధ్ర జ్యోతి): డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈ ఈసెట్)-2024 ఉత్తీర్ణులై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు 23వ తేదీ నుంచి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిఫికెట్ల పరిశీలనకు హాజరు కాని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ నెల 21న కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


అంబేద్కర్ విగ్రహాంకు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబే ద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిబిరంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం అనుమతులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను విడదల చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు విడదల చేయడంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులు విడుదల చేసే వరకు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శి కోల నర్సయ్య, ఏనుగుల కేశవరావు, నాయకులు గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గుంతలు పడిన రోడ్డు

అంతర్గాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని నిర్వాసిత గ్రామం కుందనపల్లిపై ఎన్‌టీపీసీ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్‌టీపీసీ సంస్థ నిర్మాణ సమయంలో కుందనపల్లికి చెందిన రైతుల నుంచి వందలాది ఎకరాల భూములు సేకరించి యాష్‌పాండ్‌లు నిర్మించింది. దీంతో బూడిద కారణంగా కుందనపల్లి అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నది. యాష్‌పాండ్‌ల కారణంగా గ్రామంలోని బావులోని నీరు కలుషితం కావడంతో పాటు వీచే గాలులతో బూడిద మొత్తం పైకి లేచి గ్రామాన్ని కమ్మేస్తోంది. బూడిద చెరువుల కారణంగా గ్రామస్థులు నిత్యం కాలుష్యం కోరల మధ్య జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో గ్రామస్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ విస్మరించి ఎన్‌టీపీసీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడి బూడిద నివారణ చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేయాలని కోరుతున్నారు.

● పూర్తిగా చెడిపోయిన రహదారులు..

ఎన్‌టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని మొగల్ పహాడ్, అక్బర్‌నగర్, బద్రిపల్లి గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రహదారులు పూర్తిగా చెడిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● సాగుకు నోచుకోని పంట పొలాలు..

మండల పరిధిలోని ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లిలో పంట పొలాలు గత కొన్ని సంవత్సరాలుగా సాగుకు నోచునోవడం లేదు. ఎన్‌టీపీసీ యాష్ పాండ్ బూడిద కారణంగా పంట పొలాల్లో తుంగ మొలిచి భూములు ప్రస్తుతం సాగుకు పనికి రాకుండా పోయాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి పొలాల్లో మొలిచిన తుంగను తొలగించి పంట పొలాలు సాగుకు అనువైన పరిస్థితులని నెలకొల్పాలని కుందనపల్లి రైతులు కోరుతున్నారు.


పొలాల్లో మొలిచిన తుంగ

● మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రం..

కుందనపల్లి పరిధిలో గల మొగల్‌పహాడ్ గ్రామంలోని మంచి నీటి శుద్ధి కేంద్రం గత సంవత్సరకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్-సీడీలో భాగంగా నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గత సంవత్సర కాలంగా నీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి మంచి నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులు చేపట్టి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు సాగుకు నోచుకోవడం లేదు..



ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో సేకరించిన భూములు పోను మిగి లిన కొద్దిపాటి భూముల్లో తుంగ మొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాజమాన్యం భూములు సాగుకు ఉపయోగ పడేలా చర్యలు చేపట్టాలి.

- మేకల బాపు, రైతు, కుందనపల్లి

తెగిపడిన విద్యుత్ తీగ

కరీంనగర్ రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో శుక్రవారం విద్యుత్‌తీగ తెగిపడింది. గురువారం సాయంత్రం కురిసిన గాలివానకు చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎల్‌టి విద్యుత్ తీగ కిందపడి ఓ పంది మృతి చెందింది. ఆ ప్రాంతానికి కాలనీవాసులు ఎవ్వరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే మరమ్మతు చేశారు.

రేపటి నుంచి యజ్ఞవరాహస్వామి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 17: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రం 38వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ నిర్మాత, ప్రముఖ సంస్కృత పండితుడు, ఆధ్యాత్మిక గురువు, పద్మశ్రీ బిరుదాంకితుడు మహామహోపాధ్యాయ శ్రీభాష్యం విజయసారథి ఆశీస్సులతో ఆదివారం నుంచి 25వ తేదీ వరకు సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ కోరారు.

ఎంబిఏ, ఎంసిఏ ఫలితాల్లో ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన ఎంబిఏ, ఎంసిఏ ఫలితాల్లో ఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంబిఏ రెండవ సెమిస్టర్‌లో జి త్రివేణి 6.96, శ్రీవాణి 6.89, ఎంసిఏలో వి నిత్య 7.9, ఫాతిమ 7.7, ఎంసిఏ నాల్గవ సెమిస్టర్‌లో ఎం రమ్య 8.29, జి అమూల్య 8.06, ఎంబిఏలో బిసాయిశ్రీ 7.14, డి నవ్య 7.06, మొదటి ద్వితీయ స్థానాలను సా ధించారన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యా ర్థులను కళాశాల చైర్మన్ ఎం తిరుపతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్‌రావు, ఎంబి ఏ విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ ఎండి ఖ్వాజామొయినోద్దీన్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

సుభాష్‌నగర్,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఉంటున్న ఫిజికల్ చాలెం జ్డ్ పర్సన్ కార్తిక్‌కు ప్రమాదం జరిగి కాలు విరిగింది. నగరంలోని కార్తిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మెన్ పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఈసీ మెంబర్ ఎలగందుల మునీందర్ పది వేల రూపాయలను అందచేశారు.

రేపు 'అంతరంగం' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 18: కవి అన్నవరం దేవేందర్ వర్తమాన జీవన చిత్రాల వ్యాసాల సంకలనం 'అంతరంగం' పుస్తకా న్ని ఆదివారం ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆవిష్కరించనున్నట్లు తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సీవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకాన్ని న్యాయవాది, అరసం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

బల్దియాలో అవినీతిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ ఎస్ నగర అధ్యక్షుడు కోరినట్టు బల్దియాలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణ జరగాలని కాంగ్రెస్‌పార్టీ కోరుకుంటోందని.. దీనిపై మొదట ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమాధానం చెప్పాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి వాటాల పంపకాల్లో తేడాతోనే బీఆర్ఎస్‌లో ఒకరిపై ఒకరు ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకుంటున్నారని అన్నారు. భూకబ్జాలు చేసి జైలుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను తీసుకెళ్లి సీపీని, కలెక్టర్‌ను కలువడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. నిబంధనల ప్రకారం 15 శాతం నిధులు రిజర్వు డివిజన్‌కు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని స్థానిక కార్పొరేటర్ మేయర్‌ను అడిగారని, ఈ విషయంలోనే వాగ్వాదం చోటు చేసుకోగా కోర్టు ఆదేశాలతో మేయర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయితే కాంగ్రెస్ పార్టీని అనడం ఏమిటన్నారు. భూకబ్జాల్లో బాధ్యులుగా ఉన్న బీఆర్ఎస్ నాయకులను తీసుకువెళ్లి సీపీకి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాది క్రితం నిర్మించిన కేబుల్ బ్రిడ్జి, ఐలాండ్స్ కమీషన్ల కక్కుర్తితో త్వరగా చెడిపోయాయని అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి స్వంత ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. దీనికి తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నాడు ఉన్న గంగుల కమలాకర్ సైతం బాధ్యుడే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, మంత్రు లు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ల నేతృత్వంలో జిల్లాను అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎండి తాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్, జీడి రమేష్, కుర్ర పోచయ్య, షబానా మహమ్మద్, ముల్కాల కవిత, జ్యోతి రెడ్డి, ఊరడి లత, మహాలక్ష్మి, హసీనా, తిరుమల, శిరీష్, వాడె వెంకట్ రెడ్డి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో సబ్ స్టేషన్‌ల మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9:30 గంటల నుంచి మాధ్యాహ్నం 12:30 గంటల వరకు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ, రూరల్, ఏడిఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య, గాదం రఘు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు సబ్‌స్టేషన్లు అంబేద్కర్‌నగర్, వావిలాలపల్లి సబ్‌స్టేషన్‌లు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు ఇందిరానగర్,రామాలయం ప్రాంతం, జ్యోతినగర్ ఏరియా, శివ థియేటర్ ఏరియా, క్రిష్టియన్ కాలనీ, కోర్టు ప్రాంతం, బ్యాంక్ కాలనీ, తేజస్కూల్, రెడ్డి ఫంక్షన్ హాల్ ఏరియా, వివేకానంద కళాశాల. తెలంగాణ చౌక్ ఫీడర్‌కు ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు, మంకమ్మతోట ఫీడర్‌కు 11గంటల నుంచి 12 గంటల వరకు రామచంద్రాపూర్ కాలనీ, ఉదయం 9:30 నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయ ప్రాంతాలు, సంతోష్‌నగర్,భాగ్యనగర్,శక్తిఆలయ ప్రాంతం, విద్యానగర్, ఆదిత్యనగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, జ్యోతినగర్, విజయదుర్గ కాలనీ,కొత్త లేబర్ అడ్డా ఉదయం 9:30నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయుప్రాంతాలు పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినాయకనగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, పిటిసి, మార్కండే యనగర్, ప్రగతినగర్, రాజీవ్ పార్క్, పాతలేబర్ అడ్డా ప్రాంతం, సిద్దార్థ పాఠశాల, వాసర ఆసుపత్రి, పారమిత పాఠశాల ప్రాంతం, సాయిబాబా దేవాలయం, లారెల్ పాఠశాల, చింతకుంట ప్రాంతం,భగత్‌నగర్,ముకరంపుర,గీతాభవన్,మున్సిపల్ ఏరియా, జడ్పీ ఆఫీస్ ఏరియా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రూరల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉ.9:30నుంచి 11:30 వరకు నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

పీడీఎస్‌యూ యాభై వసంతాల పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో యాభై వసంతాల విజయోత్సవ సభ పోస్టర్‌ను బస్టాండ్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ మాట్లాడుతూ ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో, 25న కాకతీయ యూనివర్సిటీలో జరిగే విజయోత్సవ సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్, రాజేష్, రాజ్‌కుమార్, ప్రదీప్, సృజన్, సాగర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తమ ఫంక్షన్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐబిఏ గార్డెన్ నిర్వాహకుడు ఇర్ఫాన్‌బిన్‌అలి కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు తమ ఫంక్షన్ హాలుపై వార్త పత్రికల్లో వార్తలు వచ్చినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కరాటేలో సెయింట్‌జార్జ్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, అక్టోబరు 18: ఎస్‌జిఎఫ్ కరాటే-14 విభాగంలో సెయింట్‌జార్జ్ (సిబిఎస్ఈ) విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు. ఈ నెల 20వ తేదీన పెద్దపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి కరాటే ఆడపోతున్నారన్నారు.

శ్రీరామ మందిరంలో మండల పూజా మహోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 18: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీరామ మందిర ప్రతిష్ఠ జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రతిష్ఠాంత యాజ్ఞికులు, వేద పండితులు గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల బృందం వైదిక నిర్వహణలో మండల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూల మూర్తులకు విశేష అభిషేకం, అలంకారం చేశారు. అనంతరం హవనం, అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దన్నమనేని మాధవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి నరసింహాచార్యులు, సముద్రాల విజయసారథి ఆచార్య, నరోత్తంరెడ్డి, రామకృష్ణారెడ్డి, కిషన్‌ప్రసాద్, వసంత్‌రావు, జీవన్‌రావు, బాస సత్యనారాయణ పాల్గొన్నారు.

బార్‌లో గొడవ చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18: నగరంలోని శనివారం మార్కెట్ ప్రాంతంలో ఉన్న మహా బార్‌లో గొడవ చేసిన పప్పు నరేష్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని వన్ టౌన్ సీఐ తెలిపారు. ఈ నెల 13న నరేష్ బార్‌లో బీర్ల గురించి గొడవ పడ్డాడు. కౌంటర్‌పై ఉన్న వ్యక్తిని బెదిరించడంతో బార్ మేనేజర్ మండల శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రక్తదానం చేసిన బీజేపీ నాయకుడు

సుభాష్‌నగర్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, న్యాయవాది బేతి మహేందర్‌రెడ్డి అత్యవసర పరిస్థితుల్లో అరుదైన ఓ నెగెటివ్ రక్తాన్ని దానం చేసి కవలల పిల్లలను కాపాడారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన అనుమల్ల రాజేందర్ దంపతులకు 12 రోజుల క్రితం కవలలు జన్మించారు. వారిద్దరు తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉండగా వారికి రక్తదానం చేశారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ నోడల్ అధికారి వెంకట పద్మావతి ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్, నేషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ ప్రవీణ్ సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి.జగన్మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నిర్మల, స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ జి. వెంకటరాజిరెడ్డి, సీనియర్ అధ్యాపకుడు కనుకయ్య, సమత, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వాఖ్యలను ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేటర్ గంట కళ్యాణి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెండి చెంద్రశేఖర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కార్పొరేటర్లకు నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందని తమకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తామన్నారు. గణేశ్ నిమజ్జనం రోజున బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగిందని, దానికి వారు కేసు పెట్టారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్‌సిటీ నిధులలో గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. సమావేశంలో కార్పొరేటర్లు కాశెట్టి శ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, ఆకుల నర్సయ్య, సరిళ్లప్రసాద్, కోటగిరి భూమాగౌడ్, ఆకుల ప్రకాశ్, నేతికుంట యాదయ్య, మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, నడిపెల్లి అశోక్‌రావు, పడిశెట్టి భూమయ్య, ఎండి ఆరిఫ్, కోడూరి రవీందర్‌గౌడ్, గంగిపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో మేయర్‌కు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు?

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కరీంనగర్ మేయర్ సునీల్‌రావుకు నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ చేసిన ఫిర్యాదు మేరకు మేయర్‌పై కోర్టు ఆదేశాలతో కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో మేయర్ హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ వేయగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

కృత్రిమ మేధస్సుపై సెమినార్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సైన్స్ మ్యూజియంలో 8,9,10వ తరగతి విద్యారులకు రాష్ట్ర శిక్షణ పరిశోధన సంస్థ సూచనల మేరకు 'కృత్రిమ మేధస్సు- సంభావ్యత ఆందోళన' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ సెమినార్‌లో విద్యార్థులు దృశ్య మాధ్యమాన్ని వినియోగించి ఒక్కో రంగంలో కృత్రిమ మేధస్సు వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా ఇతర రంగాల్లో ఏవిధంగా వినియోగపడుతుందో వివరించారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి సూచించారు. న్యాయనిర్ణేతలుగా సరిత మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధన్‌రాజ్ వ్యవహరించారు. భువన కృతి ఏడో తరగతి విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రావు తెలిపారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు వింధ్యావాలీ విద్యార్థిని ఎంపిక



సహస్రను అభినదిస్తున్న డీఈవో

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 18: రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని వింధ్యావాలీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె సహస్ర ఎంపికయింది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న సహస్ర థియేటర్ ఆర్ట్స్ అంశంలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా సహస్రను జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్ జనార్ధన్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

15 రోజుల్లో హద్దులు నిర్ణయిస్తాం



గ్రామస్థులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

తిమ్మాపూర్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాకాలనీలోని అనంతపద్మ నాభ స్వామి ఆలయ భూములకు సంబంధించిన హద్దులను 15 రోజుల్లోగా నిర్ణయిస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ అన్నారు. రామకృష్ణాకాలనీ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు, సర్వే డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా భూముల కొలతలు తీశారు. ఆలయ భూములపై కోర్టులో వివాదం సమసిపోవడంతో అధికారులు కొలతలు చేపట్టారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

శంకరపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామంలో బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు కనకం సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి పరిశీలించారు.

శ్రీహనుమాన్ ఆలయ ధర్మకర్తల నోటిఫికేషన్ విడుదల

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని శ్రీహనుమాన్ అలయానికి నూతన ధర్మకర్తల మండలి నోటిఫికేషన్‌ను దేవాదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం విడుదల చేసినట్లు ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు ధర్మకర్తల మండలి దరఖాస్తు ఫామ్‌ను నింపి 20రోజుల్లోగా జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మెప్మా పీడీ స్వరూపరాణి

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలపడా లని మెప్మా పీడీ స్వరూపరాణి అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొండూర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి కాంటీన్‌ను మెప్మా పీడీ స్వరూపరాణి, డీఎంసీ శ్రీవాణి, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరా మహిళ శక్తి కింద శ్రీలక్ష్మి సమాఖ్యలోని సంఘ సభ్యులు గ్రూపుగా ఏర్పాటై క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిని రమ, బొంగోని వీరన్న, దేశిని రాధ-సదానందం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మహిళా శిశు వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు వికాస కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాన ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలో గల మహిళా శిశు వికాస కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్ అనితా సింగ్నాథ్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుధా, అకౌంటెంట్ రాజా కిషన్ రెడ్డి, సిబ్బంది రేణుక, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని బాలయ్యపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని సాయబ్ పల్లెకు చెందిన ఎంబీఏ విద్యార్థిని కామెర సమతకు శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రథమ సంవత్సరం ఫీజు చెల్లింపునకు చెక్ అందజేశారు. నేతకాని సామాజికవర్గానికి చెందిన కామెర సంపత్ కుమార్తె సమత కరీంనగర్‌లోని నిగమ కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. ఫీజులు కట్టలేని పరిస్థితిలో కాలేజీ మానేసింది. కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సమతను క్యాంపు కార్యాలయానికి పిలి పించి చెక్ అందజేశారు. లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదువు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, రాజేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్ రెడ్డి, అశిఖ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

సైదాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు గడిపె సహోదర్, ప్రధాన కార్యదర్శి తిపిరిశెట్టి రమేష్, జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

గంగాధర: ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆశా వాహుడు పోలీసు సత్యనారాయణ అన్నారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్, గర్షకుర్తి, ఉప్పరమల్యాల పాఠశాలలో ఉపాధ్యాయులను విరామ సమయంలో ఆయన కలిసి మద్దతు తెలుపాలని కోరారు.

అంగన్‌వాడీల్లో ఫ్రైడే సభలు

శంకరపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, కొత్తగట్టు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగట్టులో నిర్వహించిన ఫ్రైడే సభలో మండల ప్రత్యేకాధికారి నాగార్జున, సీడీపీవో శ్రీమతి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, స్రవంతి పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

గంగాధర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి, ఐసిడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, పల్లె డాక్టర్ ప్రియాంక,గ్రామ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మానకొండూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికోతలు ప్రారంభమై పది రోజులు దాటినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలేదన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గంగాధర: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వెంటనే తూకం వేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన గంగాధర మండలం బూరుగుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలుగ కుండా చూడాలని కోరారు. వరి కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం సరికాదని తెలిపారు.

శంకరపట్నం: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గిట్ల ముకుందారెడ్డి అన్నారు. శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోన్ కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, వాసుదేవ్, చక్రపాణి, ష్టిల తిరుపతి, కొమ్మరాజుల వెంకటేష్ పాల్గొన్నారు.

పత్తి ధరల్లో కోత విధించొద్దు

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) పత్తి ధరల్లో కోత విధించకూడదని జిన్నింగ్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీసీఐ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ అర్జున్‌దావే జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసిన సమయంలో ఆయనతో పాటు రవీందర్‌రెడ్డి ఉన్నారు. అర్జున్‌దావే వెళ్లిన అనంతరం ఓ జిన్నింగ్ మిలులో స్థానిక మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జమ్మికుంట మార్కెట్ యార్డులో ఒక ధర నిర్ణయించిన తర్వాత దిగుమతి కోసం మిల్లులకు వచ్చిన సమయంలో ధర ఎందుకు తగ్గించాల్సి వస్తుందని ప్రశ్నించారు. మిల్లులో దిగుమతి చేసే సమయంలో తమకు మధ్యరకం పత్తి కనిపించడం వల్లే ధర తగ్గించాల్సి వస్తుందని స్థానిక మిల్లర్లు చెప్పారు. ఇకపై యార్డులోనే పూర్తి స్థాయిలో తనిఖీ చేసుకోవాలని సూచించారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



వసతులు కల్పించని క్రీడా ప్రాంగణం

ఇల్లందకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడలపై ఆసక్తి కలిగించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైదానాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను వినియోగించక పోవడతో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఒక్కో క్రీడా ప్రాంగణానికి సుమారు 4లక్షల రాపాయలు వెచ్చించి 18 గ్రామాల్లో చేపట్టారు. అనంతరం అధికారులు పట్టించుకోక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నవంబరు 3న నిర్వహించనున్న ధర్మ సమాజ్ పార్టీ కార్య కర్తల మహా సమ్మేళనం పోస్టర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్, బాబు, రవి, సురేష్, సందీప్, రవితేజ పాల్గొన్నారు.

మీ సేవా ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కిషోర్

గన్నేరువరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీ సేవా ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని జంగపల్లి గ్రామ మీసేవా నిర్వాహకుడు అనుమాండ్ల కిషోర్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మీసేవా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

గౌడ సంఘం కౌండిన్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

గన్నేరువరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గౌడ సంఘం కౌండిన్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి, ప్రధానకార్యదర్శిగా బుర్ర శ్రీధర్, కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్, కోశాధికారిగా మల్లేష్, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు అవగాహన

ఇల్లందకుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సిరిసేడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పద్మపాణి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్య, వీహెచ్‌ఎన్ బాల సౌరీలు, పద్మపాణి సొసైటీ లింక్ వర్కర్ భోగం రాజు హెచ్ ఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వీణవంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కర్రె దేవరాజ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకుడు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

పశువులకు టీకా వేయించాలి

సైదాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధిని నివారించేందుకు పశువులకు తప్పనిసరిగా టీకా వేయిం చాలని మండల పశువైద్యాధికారి విజేందర్ రావు అన్నారు. జాగీర్‌పల్లి గ్రామంలో శుక్రవారం 195 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశామని ఆయన తెలిపారు.